క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

లేపాక్షి: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఎస్ఐ గోపీ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలను ఆపి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు డ్రైవర్లు తప్పని సరిగా సీటు బెల్టు ధరించాలని, లేక పోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జైన దేవాలయం సందర్శన

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలోని పురాతన జైన దేవాలయాన్ని బెంగళూరు నుంచి వచ్చిన జైన్ మిలన్ సభ్యులు ఆదివారం సందర్శించారు. ఇందులో భాగంగానే గోమటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అక్కడి నుంచి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ప్రతి నెలా ఉచితంగా వైద్య సేవలను అందించడం అభినందనీయమని, తమవంతు సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం జైన్ మిలన్, ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి రోగుల నుంచి స్పందన లభించింది. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్, గైనాకాలజీకి సంబంధించిన డాక్టర్లు సప్తగిరి నర్సింగ్ హోం నుంచి వచ్చారు. 400 మంది రోగులను పరీక్షించి వారికి తగు సూచనలు అందించడంతో పాటు రూ.40 వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు. అలాగే ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలను ఉచితంగా చేశారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన రోగులకు ఉచితంగా బెంగళూరులోని సప్తగిరి ఆస్పత్రిలో ఆపరేషన్ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

అమ్మవార్లకు బోనాలు


గోరంట్లలో బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

గోరంట్ల: స్థానిక చిత్రావతి నది ఒడ్డున వెలసిన మేదర కులస్తుల సత్యదేవత మల్లలమ్మకు ఆదివారం మేదర కులానికి చెందిన మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

హిందూపురం: పట్టణంలోని నింకంపల్లి రోడ్డు వద్ద ఉన్న యల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం బోనాల ఉత్సవం ఘనంగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.


హిందూపురంలోని యల్లమ్మకు బోనాలు తీసుకెళ్తున్న భక్తులు


మడకశిర: బాబా సేవలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప


అగళి మండలం ఎంఎం పాళ్యంలో అలంకరణలో గురు దత్తాత్రేయస్వామి


రొద్దం: రుద్రపాద శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం


హిందూపురం మండలం ముదిరెడ్డిపల్లిలో సాయిబాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ


హిందూపురం: షిర్డిసాయి ఆలయంలో కలశాల పూజ చేస్తున్న దృశ్యం


హిందూపురం: యోగా థెరపీ కేంద్రంలో ప్రసంగిస్తున్న నరహరి పీఠాధిపతి రాజారాం


హిందూపురం కొటిపి రోడ్డులో వ్యాస మహర్షికి పూజలు చేస్తున్న బెస్త సేవా సంఘం నాయకులు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- భక్తులతో కిటకిటలాడిన బాబా, దత్తాత్రేయుడి ఆలయాలు
- పెద్ద ఎత్తున అన్నదానాలు

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో మహాగణపతి, నవగ్రహ, మృత్యుంజయ, నవగ్రహ, సాయినాథ, దత్తాత్రేయ, విష్ణుసహస్రనామ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. సామూహిక భజనలు, సంకీర్తనలు ఆలపించారు. సాయిబాబా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అన్ని చోట్లా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. గురుపౌర్ణమి విశిష్టతను తెలియజేశారు. – సాక్షిబృందం


హిందూపురం: శేషసాయినాథుడి సన్నిధిలో నాటక ప్రదర్శన


మడకశిర: అలంకరణలో సాయిబాబా మూల విరాట్


పెనుకొండ: ఆల్విన్ కాలనీలో బాబాకు పూజలు చేస్తున్న భక్తులు


సోమందేపల్లి: వేలంలో దక్కించుకున్న లడ్డూను అందుకుంటున్న సునీల్ కుటుంబ సభ్యులు


మడకశిర: సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న భక్తులు


పెనుకొండ మండలం గుట్టూరులో అలంకరణలో సాయిబాబా


పరిగి: బాబా ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు


మడకశిర మండలం భూమానంద ఆశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం


చిలమత్తూరు మండలం బలిజపల్లిలో అలంకరణలో సాయిబాబా


అమరాపురం: బాబా ఆలయంలో భక్తులకు ప్రసాదం అందజేస్తున్న కమిటీ సభ్యులు

హోరాహోరీగా ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు

పెనుకొండ: పట్టణంలో ఉన్న క్రీడా మైదానంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఆదివారం మూడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్ అమరాపురం – రొద్దం జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన రొద్దం జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 154 పరుగులు చేయగా అమరాపురం జట్టు కేవలం 52 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. రెండో మ్యాచ్ కదిరి – మడకశిర జట్ల మధ్య జరిగింది. మడకశిర జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 104 పరుగులు చేయగా కదిరి జట్టు 86 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో మడకశిర జట్టు విజయం సాధించింది. అదేవిధంగా మూడో మ్యాచ్ గుడిబండ – నంబులపూలకుంట జట్ల మధ్య జరగ్గా మొదట బ్యాటింగ్ చేసిన గుడిబండ జట్టు 103 పరుగులు చేసింది. ఎన్‌పీకుంట జట్టు కేవలం మూడు వికెట్ల నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌లుగా రామాంజినేయులు, మంజు, యోగి ఎంపిక కాగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నరేష్, తహీర్‌వలి తదితరులు వారికి అవార్డులు అందజేశారు.


మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్



గొల్లపల్లిలో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్ల స్వాములు, పరిగిలో జలధికి తరలివెళ్తున్న పీర్ల స్వాములు

ముగిసిన మొహర్రం

పెనుకొండ రూరల్: మండలంలోని గొల్లపల్లి, చంద్రగిరి, శెట్టిపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకలు ముగిశాయి. ఆదివారం తెల్లవారుజామునే పీర్ల స్వాములను ఆయా ప్రాంతాల్లో అగ్నిగుండ ప్రవేశం చేశాయి. సాయంత్రం జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున భక్తులు తరలిరాగా పీర్ల మకాన్ల వద్ద ప్రార్థనలు చేశారు. పీర్ల స్వాముల ఊరేగింపు అనంతరం జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు.

పరిగి: మండలంలో పలు గ్రామాలలో మొహర్రం వేడుకలు ఆదివారంతో ముగిశాయి. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాబయ్యస్వామి పీర్ల చావిడిలో శనివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశంతో పాటు బాబయ్యకు చదివింపులు చేపట్టారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో చేశారు. తర్వాత పీర్ల స్వాములను జలధికి తరలించారు.

మీటర్లు వద్దని అడ్డగింపు

రొద్దం: మండల పరిధిలోని ఆర్ మరువపల్లిలో వ్యవసాయ మోటర్లకు విద్యుత్ మీటర్లు అమర్చుతుండగా ఆదివారం కొందరు రైతులు అడ్డుకున్నారు. తమ వ్యవసాయ మోటర్లకు మీటర్లు అవసరం లేదని చెప్పారు. కాంట్రాక్టర్ మంజునాథ్‌ను 'సాక్షి' వివరణ కోరగా గతంలో మీటర్ల పెట్టడానికి రైతులు ఒప్పుకున్నారన్నారు. అయితే కొన్ని బోర్లలో మోటర్లు లేనందున మీటర్ల వద్దని చెప్పారని వివరించారు.

ఇచ్చిన హామీ నెరవేర్చాలి

హిందూపురం: 'ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల అసోసియేషన్ సభ్యులకు జీవన భృతి, వైద్య సదుపాయాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలి' అని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఆ సంఘం నాయకుడు ఆనందప్ప ఆధ్వర్యంలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏకు వినతిపత్రం అందించారు.

వినూత్నంగా కలుపుతీత



లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన నంజుండప్ప అనే రైతు నూతన పద్ధతిలో తన పొలంలో ఉన్న కలుపును తొలగించుకుంటున్నాడు. తనకున్న ఎకరం పొలంలో ఆయన వేరుశనగ పంట వేశాడు. కలుపు తీసేందుకు కాడెద్దుల కోసం గ్రామంతో పాటు చుట్టు పక్క ఊళ్లలోనూ తిరిగాడు. ఎక్కడా ఎద్దులు దొరకలేదు. దీంతో చివరకు ఆ రైతు సైకిల్ చక్రానికి కలుపు తొలగించేందుకు పొలుగుతో కూడిన దిండను అమర్చి కలుపు తొలగించుకుంటున్నాడు. సరైన సమయానికి ఎద్దులు దొరకకపోవడంతోనే ఈ విధంగా కలుపు తొలగించుకుంటున్నానని రైతు నంజుండప్ప తెలిపారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్

హిందూపురం: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకొని అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయనంద్, గౌరవ అధ్యక్షుడు గోపాలం శివ నారాయణ తెలిపారు. స్థానిక చైతన్యనగర్‌లోని ఎస్ఎస్‌బీఆర్ కళాశాలలో జేవీవీ ప్లీనరీ సమావేశం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురం ప్రాంత చెరువులన్నీ నింపాలన్నారు. ఐటీ పరిశ్రమ స్థాపించి, పెరిగిన జనాభాకు అనుగుణంగా పట్టణంలో రింగురోడ్డు వేయించాలని డిమాండ్ చేశారు. లేపాక్షిని టూరిస్ట్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలని తీర్మానించారు.

ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలు

మడకశిరరూరల్: గురుపౌర్ణమి సందర్భంగా జాతీయ హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులోని కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ వ్యాస మహర్షి పురస్కారాలను అందించారు. ఇందులో భాగంగానే మడకశిర మండలంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు. మడకశిర మండలం బుళ్లసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె విశ్వనాథ్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ వ్యాస మహర్షి పురస్కార అవార్డును అందించి సన్మానించారు. అలాగే పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న డాక్టర్ శివన్నకు వ్యాస మహర్షి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార అవార్డును అందించారు. ఉపాధ్యాయ వృత్తిని సక్రమంగా నిర్వహిస్తూనే విద్యార్థులకు, ప్రజలకు జాతీయ భావాలు, ధార్మిక విషయాలు, హిందూ సంస్కృతి పరిరక్షణ చర్యలు నేర్పుతున్నందున ఉపాధ్యాయులకు పురస్కారాలు లభించాయి. విశ్వనాథ్, శివన్నలను అవార్డులు వరించడంతో మడకశిర మండల యూటీఎఫ్ సంఘం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.


ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్న కె విశ్వనాథ్, డాక్టర్ శివన్న

గోరంట్లలో జోరుగా ఇసుక దందా



చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తవ్వుతున్న జేసీబీ , ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తున్న దృశ్యం

- రెండు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

గోరంట్ల: పట్టణానికి సమీపంలోని స్వాగరాళ్ల వద్ద చిత్రావతినదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకులు చిత్రావతినదిలో అక్రమంగా ఇసుక తవ్వి ఒక చోట డంప్ చేసి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా జేసీబీ సాయంతో ఇసుక తవ్వి రెండు ట్రాక్టర్ల సాయంతో దందా సాగిస్తుండగా ఆదివారం ఆ వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. రెండు ట్రాక్టర్లను, జేసీబీని సీజ్ చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. అలాగే జేసీబీ ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం వెనుక కూడా ఓ టీడీపీ నాయకుడి హస్తం ఉందన్న ఆరోపణలున్నాయి.

సర్వే వేగవంతం చేయండి

రొళ్ల: గ్రామాల్లో ఆరోగ్య, ఆశ వర్కర్లు సంయుక్తంగా కుష్టువ్యాధి అనుమానితుల గుర్తింపు సర్వేను వేగవంతం చేయాలని పీహెచ్ఎన్ సుధారాణి తెలిపారు. కుష్టువ్యాధి అనుమానితుల గుర్తింపుపై ఇప్పటికే ఆరోగ్య, ఆశ వర్కర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. రోజూ ఇంటింటికీ వెళ్లి కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించి వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. కుష్టువ్యాధి మైక్రో బ్యాక్టీరియా లెప్రే అని బ్యాక్టీరియా వల్ల వస్తుందన్నారు. వ్యాధి ఉన్న వారు తుంపర్ల వలల, తుమ్మడం వల్ల వ్యాప్తి చెందుతుందని చెప్పారు. వచ్చే నెల 2వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాలని సూచించారు. అలాగే 60 ఏళ్లు పైబడి వృద్ధులకు రోగనిరోధకశక్తి పెరగడం కోసం బీసీజీలు తప్పని సరిగా వేయాలని పేర్కొన్నారు.


అశేష భక్త జనం మధ్య సాగుతున్న బ్రహ్మరథోత్సవం

కనుల పండువగా బ్రహ్మ రథోత్సవం

పావగడ: తాలూకాలోని అరసికెరె గ్రామంలో వెలసిన గుజ్జారి ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయం వద్ద ఉదయం నుంచే భక్తుల కోలాహలం మొదలైంది. ఆలయంలో ఆంజనేయస్వామికి అర్చకులు అభిషేక పూజలు చేశారు. బ్రాహ్మణోత్తములు ప్రత్యేకంగా హోమాలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య బ్రహ్మరథంలో కొలువుదీర్చారు. అనంతరం బ్రహ్మ రథోత్సవాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు అరటి పండ్లను రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల మధ్య ఎలాంటి తోపులాట జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

25న మండల సర్వసభ్య సమావేశం

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 25న ఉదయం 11 గంటలకు ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలాధికారులు హాజరు కావాలని కోరారు.

రథయాత్ర విజయవంతం చేయండి

పావగడ: నేడు పావగడకు విచ్చేయనున్న 'కన్నడ జ్యోతి సువర్ణ రథయాత్ర' కు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి రథయాత్రకు ఘనంగా స్వాగతం పలకాలని స్థానిక తహసీల్దార్ వరదరాజు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కన్నడ నాడుకు కర్ణాటక అనే నామకరణం చేసి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 'హెసరాయితు కర్ణాటక హుసిరాగలి కన్నడ' (పేరు గాంచింది కర్ణాటక, ఊపిరి కావాలి కన్నడ) అభియానలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సంచరిస్తున్న రథయాత్ర సోమవారం మధ్యాహ్నం 1 గంటకు పావగడ పట్టణానికి చేరుకుంటుందన్నారు. పట్టణంలోని శిరా రోడ్డు దేవలకెరె క్రాస్ వద్ద రథయాత్రకు ఘనంగా స్వాగతం పలకడానికి అందరూ అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు.